



గోదావరి వంతెనపై గండాలు

బాసర: మండలకేంద్రంలోని గోదావరి వంతెనపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భైంసా–నిజామాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో 500 మీటర్ల మేర ఉన్న వంతెనపై 30 వరకు లోతైన గుంతలున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలుస్తుండటంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

బురద రోడ్లే దిక్కు..


గుంతలమయంగా భైంసా–సిద్దూర్ రోడ్డు


బురదమయంగా సిరాల–ఇలేగాం రోడ్డు

భైంసారూరల్: మండలంలోని సిరాల–ఇలేగాం, కామోల్–కథ్‌గాం, భైంసా–సిద్దూర్, మహాగాం–చింతల్‌బోరి, భైంసా–వాడి గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. పలు చోట్ల గుంతలు ఏర్పడి నీరు నిలుస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏటా వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు రోడ్లు వేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సారూ.. ఈ గుంతలు పూడ్చరూ


హనుమాన్ ఆలయం వద్ద


బెల్లాల్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కడెం: నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై కడెం మండలంలోని బెల్లాల్ రోడ్డు వద్ద, పాండ్వపూర్ హనుమాన్ ఆలయం, హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద, కన్నాపూర్ సమీపంలో బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనం అదుపుతప్పి పలువురు కింద పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలలు తల్లిపాలే తాగించాలి


బాసర : అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


లోకేశ్వరం మండలం రాజూరలో..


ఖానాపూర్ : మాట్లాడుతున్న ఏఎన్‌ఎం పార్వతి

బాసర: శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలే తాగించాలని ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ సునంద పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని శారదనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముర్రుపాలలో బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ, నిరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్‌ఎం గోదావరి మాట్లాడుతూ..తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ పద్మజావాణి, శిరీష, ఆశవర్కర్లు శ్రీలత, సవిత, మమత ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పార్వతి, లావణ్య, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, ఆశ వర్కర్లు త్రివేణి, సునీత తదితరులున్నారు.

అడెల్లి ఆలయం దుకాణాల వేలం

- ప్రధాన టెండర్లకు ముందుకు రాని వ్యాపారులు


వేలంలో పాల్గొన్న వ్యాపారులు, అధికారులు

సారంగపూర్: జిల్లాలోని ప్రసిద్ధ అడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వివిధ వ్యాపారాలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ఆధిపత్య పోరు కొనసాగింది. 9 రకాల వ్యాపారాలకు నిర్వహించిన వేలంలో కేవలం మూడింటికి మాత్రమే వ్యాపారులు పోటీ పడ్డారు. ఆరు ప్రధాన వ్యాపారాలకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో వాటి వేలం రద్దు చేశారు. ఇడుపుడు పిల్లలు తిప్పుకునే హక్కునకు రూ.81 వేలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.43 వేలు, తైబజార్ వసూలు చేసుకునే హక్కునకు రూ.4.18 లక్షలకు హక్కులను దక్కించుకున్నారని ఈవో రమేశ్ తెలిపారు. మిగతా ఆరింటికి ఈనెల 12న రీటెండర్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాకలమండలి సభ్యులు రెండు వర్గాలుగా చీలి ప్రధాన టెండర్లు వాయిదా వేయించినట్లు తెలుస్తోంది. వీరంతా అమ్మవారి ఆదాయానికి గడ్డి కొట్టే అవకాశం ఉందని భక్తులు అనుమానిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, పాలకవర్గ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి రక్షాబంధన్ వారోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శశికాంత్, తదితరులు

నిర్మల్‌టౌన్: జిల్లా యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు రక్షాబంధన్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వప్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు నాలం శశికాంత్ పేర్కొన్నారు. వారోత్సవాల కరపత్రాలను శనివారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొనాలన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సుమారు లక్ష కరపత్రాలను పంపిణీ చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. గాయత్రి మంత్రం పఠిస్తూ కోటి హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం చేపట్టిన శేట్‌పల్లి అరుణ్ శర్మను అభినందించారు. కార్యక్రమంలో కత్రోజ్ అశోక్‌చారి, సాదం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చాణక్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో యాజమాన్యం

నిర్మల్‌టౌన్: ఇటీవల సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ (ఎస్‌ఓఎఫ్) వారు నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో జిల్లాకేంద్రంలోని చాణిక్య పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా యజమాన్యం శనివారం పాఠశాలలో విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు ప్రమోద్‌రావు, ప్రిన్సిపాల్ హరీశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు రానీయొద్దు

లక్ష్మణచాంద: పింఛన్లను ముఖ గుర్తింపు ద్వారా పంపిణీ చేస్తున్నందున.. వృద్ధులకు, దివ్యాంగులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని డీపీఎం మారుతి సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని వడ్యాల్ పోస్టాఫీస్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పింఛన్ల పంపిణీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ట్రిపుల్‌ఐటీలో మహిళా చీఫ్ వార్డెన్ నియామకం

బాసర: బాసర ఆర్జీయూకేటీ కళాశాలలో మహిళా చీఫ్ వార్డెన్‌ను నియమించినట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. క్యాంపస్‌లో విద్యార్థినులకు మెరుగైన పర్యవేక్షణ, భద్రత, శ్రేయస్సు కల్పించేందుకు అడిషనల్ మహిళా చీఫ్ వార్డెన్ల నియామకం జరిగిందని పేర్కొన్నారు. పీయూసీ విద్యార్థిని విభాగానికి సుజాత, ఇంజినీరింగ్ విద్యార్థిని విభాగానికి శ్రీవిద్యను అడిషనల్ మహిళా చీఫ్ వార్డెన్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.

ధర్మాజీపేట్‌లో పశువైద్య శిబిరం


పశువుకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కడెం: పశువైద్యాన్ని రైతులు, పశువుల పెంపకందారులు వినియోగించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్వర్ సూచించారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఇటీవల పురుగుల మందు స్ప్రే చేసిన గడ్డి తిని ఆరు గేదెలు మృతిచెందాయి. దీంతో గ్రామాన్ని పశువైద్యాధికారులు శనివారం సందర్శించారు. గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులకు మందులు అందజేశారు. గ్రామంలోని పశువుల రక్త నమూనాలు సేకరించి ఆదిలాబాద్, హైదరాబాద్ ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నామని తెలిపారు. పశువుల ఆరోగ్యంపై సందేహాలు ఉంటే వెంటనే మండల పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏల్ సతీశ్, పశు వైద్యాధికారులు మహేశ్, సౌందర్య సిబ్బంది రాజేశ్వర్, నారాయణ, గోపాల్, మదన్, రమేశ్, విజయ తదితరులు ఉన్నారు.

శిథిల ఇళ్లను తొలగించుకోవాలి


శిథిల ఇంటిని పరిశీలిస్తున్న టీపీవో అనురాధ

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండవద్దని.. వాటిని వెంటనే తొలగించాలని భైంసా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ సూచించారు. ఈమేరకు పట్టణంలోని పలు కాలనీల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో శిథిలావస్థకు చేరిన 25 ఇళ్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీటిలో రెండింటిని తొలగించి.. మిగతా వారికి నోటీసులు అందించినట్లు చెప్పారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

'సర్దుబాటు'సమస్యలు సృష్టించొద్దు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి శశిరాజ్

కుంటాల: జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సమస్యలు సృష్టించొద్దని తపస్ జిల్లా ఇన్‌చార్జి గోనెల శశిరాజ్ పేర్కొన్నారు. శనివారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు, సంఘాల నాయకుల జోక్యంతో సర్దుబాటు ప్రక్రియ చేపడితే ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఉపాధ్యాయులకు విద్యార్థులకు సమ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్, సుదర్శన్, జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులు చంద్రప్రకాశ్, జైస్వాల్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న నారాయణ్‌రావు పటేల్

తానూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలోని మహాదేవుడి ఆలయంలో శనివారం ప్రత్యేక చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరిగాం మాహదేవుడి ఆలయానికి రూ.50 లక్షలు కేటాయించి ఇరువైపుల సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని.. కల్యాణ మండపం నిర్మాణానికి రూ.9 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు, ఆలయ సమీపంలో అతిథి గృహం మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహరాజ్‌కు ప్రతి నెల రూ,10 వేల గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కోఆప్షన్ మాజీ సభ్యుడు చంద్రకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుపటేల్, శంకర్ చంద్రే, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్ నియంత్రించాలి

భైంసాటౌన్:పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి నియంత్రణకుచర్యలు చేపట్టాలని పలువురు ముస్లింలు శనివారం ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయంతోపాటు పశువైద్య ఆస్పత్రిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో కొందరు మాంసం వ్యాపారులు లంపీస్కిన్ సోకిన పశువుల మాంసం విక్రయిస్తున్నారని.. దీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని.. కొనుగోలుదారులతో దురుసుగా వ్యవహరిస్తూ తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయం భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దృష్టికి వెళ్లింది. ఆయన స్పందించి జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్, ఏడీ బాలిక్ అహ్మద్‌ను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో వారు పట్టణ సీఐ గోపినాథ్,పశువైద్యుడు విఠల్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్‌తో కలిసి వ్యాపారుల వద్దకు వెళ్లి పరిశీలించారు. విక్రయదారులు మున్సిపల్ నుంచి లైసెన్స్ పొందాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

- **ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ**

కుంటాల: ఎరువులు, విత్తనాలు కొనే రైతులకు తప్పనిసరిగా రసీదు అందించాలని తహసీల్దార్ కమల్‌సింగ్.. డీలర్లకు సూచించారు. శనివారం కుంటాలలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ధరల వివరాల బోర్డు కన్పించేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజేశ్వర్ ఉన్నారు.

- **ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలి**

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని నర్సింహనగర్ తండాలో పర్యటించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పన్నులను కార్యదర్శులు వసూలు చేయాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

- **ఇళ్ల నిర్మాణాలు పరిశీలన**

మామడ: మండలంలోని లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణి ఉన్నారు.

- **దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన**

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయతోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **నిధుల సేకరణ**

తానూరు(ముధోల్): మండలకేంద్రమైన ముధోల్‌లో భైంసా బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సభ్యులు నిధులు సేకరించారు. ప్రతి ఆదివారం భైంసాలోని టేక్రి బుద్ధవిహార్ ఆవరణలో భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో చేపడుతున్న వందన కార్యక్రమానికి చిన్నారుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. బాల్య దశ నుంచే చిన్నారుల్లో ఆధ్యాత్మిక జ్ఞానం పెంచి, బౌద్ధ ధర్మం సంస్కారాలను వివరిస్తామని.. కుటుంబ సమేతంగా ఉపాసికులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు భారతీయ బౌద్ధమహాసభ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- **కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి**

భైంసాటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు రాహుల్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో భోజనం ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

- **ప్రజా సంక్షేమమే ధ్యేయం**

కడెం: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండుకూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. సారంగపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమ్మరి సుధాకర్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు అరుణ, రాజు, నాయకులు కోల శ్రీనివాస్, లక్ష్మణ్, సాయికృష్ణ, ఆనందం, సత్తెన్న, సంజీవ్‌రెడ్డి తదితరులున్నారు.

- **పసుపు సాగుపై అవగాహన**

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో శనివారం పంట యాజమాన్య పద్ధతులపై అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ, ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, అవ్వాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పసుపు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లోని సుగంధద్రవ్యాల బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ పసుపు యాజమాన్య పద్ధతుల గురించి ప్రొజెక్టర్ ద్వారా రైతులకు వివరించారు. విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం, కలుపు తీసే పద్ధతి, పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అధికారులు రాజమాణిక్యం, సుమన్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, బండారి రమేశ్, నర్సింహారెడ్డి, రాంగోపాల్, అభినవ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు దినేశ్, పవన్, మహేందర్, రూప్లానాయక్, బోసు నారాయణ, తొడసం సురేశ్, శంకర్, రమ్య తదితరులు ఉన్నారు.

- **మాక్ పోలింగ్**

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామ మహాత్మ జ్యోతి బాపూలే(ఎంజేపీ) గురుకుల బాలుర పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు పలువురు ఉపాధ్యాయులు వివరించినట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు.

ఈ రోజు

విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11 కేవీ రెండో ఫీడర్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు బస్టాండ్ రోడ్, గోకుల్‌నగర్, వినాయక్‌నగర్, ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, హజ్గుల్, పేండ్‌పెల్లి, సుంక్లి, వాటోలి, మాటేగాం, హంపోలి, బోరిగాం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

పాదయాత్రకు తరలిరావాలి

భైంసాటౌన్: ఖానాపూర్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో చేపడుతున్న జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బాదన్‌కుర్తి నుంచి ఖానాపూర్ పట్టణానికి చేరుకుంటుందని.. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

టీయూటీఎఫ్ సమావేశం

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికాంత్, వహీద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ లచ్చిరాం, రఘునందన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. సంఘ సభ్యత్వం, విద్యారంగ సమస్యలు, ప్రమోషన్లు మొదలైన అంశాలపై చర్చిస్తామని తెలిపారు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ఖానాపూర్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడారు. మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన పోడు రైతులు బోసు భూమన్న, నర్సయ్య 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో అటవీ అధికారులు గుంతలు తవ్వడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకోవాలని అన్నారు. లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగెల్లి నర్సయ్య, సీపీఎం నాయకులు చుంచుల నారాయణ, రాపెల్లి రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కడెం ఏపీఎంగా గంగాధర్



కడెం: ఐకేపీ నూతన ఏపీఎంగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పని చేసిన రాజారాం బదిలీపై ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలానికి వెళ్లగా.. ఆయన స్థానంలో దస్తురాబాద్ ఏపీఎంగా విధులు నిర్వహించే గంగాధర్ బదిలీపై కడెంకు వచ్చారు.

లోకేశ్వరం ఏపీఎంగా భోజన్న



లోకేశ్వరం: మండలకేంద్రంలోని మండల సమాఖ్యా కార్యాలయంలో శనివారం భోజన్న నూతన ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం మల్లేశ్ ఖానాపూర్‌కు బదిలీ కాగా.. ఖానాపూర్‌లో పనిచేసే ఏపీఎం లోకేశ్వరం వచ్చారు.

బాధితులకు సాయం


నగదు అందిస్తున్న స్నేహితులు

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన బాదోళ్ల మహేశ్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు. వీరి కుటుంబ దీనస్థితిని గమనించి మహేశ్‌తో కలిసి నర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదోతరగతి చదివిన మిత్రులు రూ.25వేలు జమ చేశారు. శనివారం మహేశ్ కుటుంబీకులను కలిసి నగదు అందించారు.

సామూహిక వ్రతం


వ్రతం చేస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ఆలయంలో శనివారం వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి వ్రతం ఆచరించారు. య ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్ రెడ్డి దంపతుల సహకారంతో గురుస్వామి మూర్తి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, గురుస్వాములు పాల్గొన్నారు.

శిక్షణకు తరలిరావాలి

ఖానాపూర్: బాసరలో ఈనెల 3, 4వ తేదీల్లో నిర్వహించే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు స్కైలాబ్, భూపాల్, జిల్లా ఇన్‌చార్జి రవీందర్ హాజరవుతారని పేర్కొన్నారు. డాకూరి తిరుపతి, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.